ప్రగతి పథంలో పర్యాటకం





నల్లమలలో కనువిందు చేస్తున్న జంగిల్‌సఫారీ

- నిధులు, ప్రచారం, సదుపాయాల కల్పనే కీలకం
- జిల్లాలో కొత్తగా ఏడు టెంపుల్ టూరిజం సర్క్యూట్ల ఏర్పాటు
- గతంలో పర్యాటకాభివృద్ధిని వెంటాడిన వైఫల్యాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఆత్మకూరు, సెప్టెంబరు 26: ఒక దేశ ఆర్థిక ప్రగతిని ప్రభావితం చేసే అంశాల్లో పర్యావరణం ఒకటి. ప్రతిదేశంలోనూ చూడదగ్గ ప్రదేశాలు, కట్టడాలు అనేకం ఉంటాయి. వాటిని అభివృద్ధిపరిచి పర్యాటక కేంద్రాలుగా మార్చి ఆదాయ వనరులుగా తీర్చితే దేశం పర్యాటకంగా అభివృద్ధి చెందుతుంది. ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ఏజెన్సీని ది వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసింది. పర్యాటక అంశాల్లో ఈ అంతర్జాతీయ టూరిజం సంస్థ ప్రపంచ వేదికగా పని చేస్తోంది. ఇది ఒక్కో సంవత్సరం ఒక్కో కాన్సెప్ట్ పేరిట వరల్డ్ టూరిజం డే నిర్వహిస్తోంది. ఈ ఏడాది "పర్యాటకం- శాంతి" నినాదంతో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. జిల్లాలో అనేక పర్యాటక కేంద్రాలు ఉన్నాయి. జిల్లా ప్రగతిలో పర్యాటకం పాత్ర ఉన్నది. ఇది గణనీయంగా మారాలంటే ఈ ప్రాంతాలను తగినంత అభివృద్ధి చేయాలి.




కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గుహలు

గతంలో నామమాత్రంగా టెంపుల్-టూరిజం సర్క్యూట్లు



2016లో రాష్ట్రవ్యాప్తంగా ప్రవేశపెట్టిన టెంపుల్-టూరిజం(ఆలయ-పర్యాటకం) ప్రాజెక్ట్ పరిధిలో ఐదు సర్క్యూట్లను గుర్తించి ఆయా సర్క్యూట్ల పరిధిలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలను, పర్యాటక కేంద్రాలను అనుసంధానించారు. అయితే ఈ సర్క్యూట్లన్నీ నామమాత్రమేనన్న విమర్శలు ఉన్నాయి. కళింగ సర్క్యూట్, విజయనగర కారిడార్, త్రిలింగయాత్ర, అష్టశక్తి యాత్ర, గోల్డెన్ ట్రయాంగిల్ అనే పేర్లతో సర్క్యూట్లను రూపొందించి పర్యాటకులను ఆకర్షించేలా ప్రత్యేక ప్యాకేజీలను అమలు పర్చాలని నిర్ణయించారు. ఇందుకు దేవదాయశాఖ, పర్యాటకశాఖలు సమన్వయంగా వ్యవహరించడమే కాకుండా ఏపీఎస్ ప్రజా రవాణా సంస్థ, ప్రైవేట్ ట్రావెల్ సంస్థల సహకారం తీసుకోవాలని భావించింది. ఇందులో భాగంగానే ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు పుణ్యక్షేత్రాలను, పర్యాటక ప్రదేశాలను టెంపుల్ - టూరిజం సర్క్యూట్‌లో చోటు కల్పించారు. విజయనగర కారిడార్ సర్క్యూట్‌లో యాగంటి, బెలుంగుహలు, త్రిలింగయాత్ర సర్క్యూట్‌లో శ్రీశైలం, మహానంది, అహోబిలం, గోల్డెన్ ట్రయాంగిల్ సర్క్యూట్‌లో శ్రీశైలం, యాగంటి, మంత్రాలయం క్షేత్రాలతో పాటు కర్నూలులోని పలు పర్యాటక ప్రదేశాలను గుర్తించారు. అయితే కేవలం సర్క్యూట్లలో పర్యాటక, పుణ్యక్షేత్రాలను చేర్చినప్పటికీ యాత్రికులను ఆకర్షించడంలో సంబంధిత శాఖలు విఫలమైనట్లు తెలుస్తోంది. కనీసం ఆయా సర్క్యూట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించిన దాఖలాలు కూడా లేకపోవడం గమనార్హం.

పర్యాటక అభివృద్ధిలో మైలురాయి బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం



పర్యాటకరంగం అభివృద్ధిలో బైర్లూటి ఎకో టూరిజం కేంద్రం ఓ మైలురాయని చెప్పవచ్చు. ఇందుకు కారణం స్వచ్ఛతే కీలకం. 2017 మే 10వ తేదిన బైర్లూటి సమీపంలో నిర్మించిన ఏకో టూరిజం కేంద్రానికి విదేశాల నుంచి యాత్రికులు తరలివస్తున్నారు. నల్లమల పచ్చని అందాలతో పాటు పరిశుభ్రమైన కాటేజీలు, ఆహార పదార్థాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, కనువిందు చేసే జంగిల్ సఫారీ పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. ఆశించిన స్థాయిలో ప్రచారం జరగనప్పటికీ ఆన్‌లైన్‌లోనే యాత్రికులు కాటేజీలను బుక్ చేసుకుని బైర్లూటి ఎకోటూరిజం కేంద్రంలో విడిది చేస్తున్నారు. కాగా పర్యావరణ పరిరక్షణలో అడవులవు పాత్రను ప్రజలకు తెలియపర్చడంతో పాటు నల్లమల అటవీ ప్రాంతాల్లో నివాసం వుంటున్న చెంచులకు జీవనోపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఎకోటూరిజం నేడు చక్కటి ఫలితాలను అందిస్తోంది.

తాజాగా ఏడు టూరిజం సర్క్యూట్లకు ఏర్పాట్లు :

నంద్యాల జిల్లాలోని చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించేలా ఏపీ పర్యాటక, దేవదాయశాఖలు సంయుక్తంగా ఏడు టూరిజం సర్క్యూట్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో సర్క్యూట్-1లో మహానంది పుణ్యక్షేత్రంతో పాటు నవనంది క్షేత్రాలు, సర్క్యూట్-2లో మహానంది, సర్వనరసింహ స్వామి ఆలయం, పచ్చర్ల నల్లమల జంగిల్ క్యాంప్, సర్క్యూట్-3లో బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం, వైఎస్ఆర్ స్మృతి వనం, రాజీవ్‌గాంధీ అభయారణ్యం సర్క్యూట్-4లో అహోబిలంలోని నవనరసింహ స్వామి ఆలయాలు, సర్క్యూట్-5లో బనగానపల్లి నవాబుల కోట, యాగంటి, బెలూం గుహలు, సర్క్యూట్-6లో కొత్తూరు సుబ్బరాయుడు, నందవరం చౌడేశ్వరీదేవి ఆలయాలు, సర్క్యూట్-7లో బేతంచెర్ల సమీపంలోని బిల్వస్వర్గం గుహలు, లక్ష్మీమద్దిలేటి స్వామి ఆలయం, వాల్మీకి గుహలను చేర్చారు. ఈ సర్క్యూట్ల ఏర్పాటుపై ఇప్పటికే కలెక్టర్ దేవదాయ, పర్యాటకశాఖ అధికారులో చర్చించారు. ఈ సర్క్యూట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇదిలావుంటే కొలనుబారతి క్షేత్రం, సంగమేశ్వర క్షేత్రాన్ని ఈ సర్క్యూట్‌లలో చేర్చకపోవడం విమర్శలకు తావిస్తోంది.



బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రం



శ్రీశైలం ఆలయం

పర్యాటక రంగం అభివృద్ధిలో పయనించాలంటే ముందుగా ప్రభుత్వాలు అవసరమైన నిధులను సమకూర్చాలి. పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని పరిగణలోకి తీసుకుని అక్కడ సదుపాయాలను తీర్చాలి. అంత కంటే ముఖ్యంగా ఆయా పర్యాటక ప్రాంతాల గురించి విస్తృతమైన ప్రచారం ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అప్పుడే ఆయా పర్యాటక ప్రాంతాలను సందర్శించాలన్న ఉత్సాహం ఏర్పడుతోంది. ఇవేమి చేపట్టకుండా మొక్కుబడిగా పర్యాటక అభివృద్ధిని ఆకాంక్షిస్తే.. ఆశయం నీరుగారిపోక తప్పదు. జిల్లాలో శ్రీశైలం పుణ్యక్షేత్రాన్ని మినహాయిస్తే.. మిగిలిన అన్ని ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలన్నింటిలో సదుపాయాలు లేవు. యాత్రికులు విడిది చేసేందుకు డార్మిటరీలు, రెస్టారెంట్‌లు, ఆహ్లాదకరమైన ప్రదేశాలు కొరవడంతో జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను వీక్షించేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు రాలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి.



మహానంది

మరుగునపడిన సంగమేశ్వరం టూరిజం కేంద్రం :

కృష్ణా పుష్కరాలను పురస్కరించుకుని 2016లో అప్పటి కలెక్టర్ సీహెచ్ విజయమోహన్ చొరవతో రూ.48లక్షల వ్యయంతో హడావిడిగా సంగమేశ్వరంలో టూరిజం రెస్టారెంట్‌ను ఏర్పాటు చేశారు. సప్తనదీజలాల్లో బోటులో విహరించేలా, సంగమేశ్వరం - శ్రీశైలానికి జలవిహారం చేసేలా పలు ప్యాకేజీలను రూపొందించారు. అయితే పుష్కరాల సమయంలో ఉన్న ఉత్సాహం పుష్కరాలు ముగిశాక అధికారులు చూపలేదు. సంగమేశ్వరంలోని పర్యాటక విషయాలను ప్రచారంలోకి తీసుకెళ్లలేదు. అక్కడికి వచ్చే భక్తులకు అవసరమైన సదుపాయాలేవి చేయలేదు. దీంతో టూరిజం రెస్టారెంట్ మరుగునపడింది. నిర్వహణ లోపం వల్లే ఈ పరిస్థితి దాపరించినట్లు స్పష్టమవుతోంది.



సంగమేశ్వరం

అవుకు రివిట్‌మెంట్‌పై మంత్రుల సమీక్ష

- పనులను త్వరలో చేపడతాం : సీఈ కబీర్‌బాషా

అవుకు, సెప్టెంబరు 26: అవుకు రిజర్వాయర్‌లో కుంగిన రివిట్‌మెంట్‌పై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి స్పందించారు. గురువారం ఉదయం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయికి వెళ్లి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంత ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ కబీర్‌బాషా, ఎస్సార్బీసీ ఎస్ఈ వరప్రసాద్, ఈఈ సురేష్‌బాబు తదితరులు కలసి కుంగిన రివిట్‌మెంట్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ వరప్రసాద్ మాట్లాడుతూ అవుకు రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్‌కు పైభాగంలో 1ప్లస్1 మీటర్లు ఎర్రరాతి రివిట్‌మెంట్ కుంగిపోయిందన్నారు. ఆ ప్రాంతాన్ని ప్రస్తుతం మట్టితో పూడ్చివేశామని, రిజర్వాయర్‌కు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. గతంలోని తూముల ప్రాంతం నుంచి మాత్రమే నీరు లీకేజీ అవుతుందే తప్ప కుంగిన రివిట్‌మెంట్ నుంచి కాదన్నారు. శ్రీశైలానికి వరద నీరు తగ్గటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిజర్వాయర్‌లో 4.1 టీఎంసీల నీటిని నింపామన్నారు. ప్రస్తుతం బానకచెర్ల నుంచి 7వేల క్యూసెక్కులు మాత్రమే రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో వస్తోందన్నారు. అవుకు జీఎన్ఎస్ఎస్ హెడ్‌రెగ్యులేటర్ నుంచి 12వేల క్యూసెక్కుల నీటిని కడప జిల్లాకు తరలిస్తున్నామన్నారు. సాయంత్రానికి రిజర్వాయర్‌లో నీటినిల్వ సామర్థ్యం 3.5 టీఎంసీలకు చేరుతుందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ పూర్తయిన వెంటనే కుంగిన ప్రాంతంలోని రివిట్‌మెంట్‌ను, కింది భాగంలో సింకయిన మట్టిని తొలగించి గతంలో ఉన్న లెవెల్‌కు రివిట్‌మెంట్‌ను నిర్మిస్తామన్నారు. రిజర్వాయర్ మరమ్మతుల కోసం ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్బీసీ డీఈలు బాబ్జీ, కొండన్న, జేఈలు సుధాకర్, ప్రకాష్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఐ.ఉగ్రసేనారెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, వెంకటరమణనాయక్, దంతెల రమణ, తిక్కన్న, మిద్దె ప్రసాద్, కిట్టు, సుధాకర్ పాల్గొన్నారు.



కుంగిన రివిట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న జలవనరుల శాఖ ఎస్ఈ వరప్రసాద్, అధికారులు

ఎస్సార్బీసీ డీఈ కొండన్నకు మెమో

అవుకు, సెప్టెంబరు 26: అవుకు రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు లోపలి బండ్ రివిట్‌మెంట్ కుంగిన ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సార్బీసీ డీఈ కొండన్నకు మెమో ఇచ్చినట్లు ఎస్ఈ వరప్రసాద్ గురువారం తెలిపారు. ఎస్ఈ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఐ. ఉగ్రసేనారెడ్డి మాట్లాడుతూ తిమ్మరాజు చెరువు పర్యవేక్షణ బాధ్యత డీఈ కొండన్నదే అన్నారు. రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ ఉన్నపుడు అధికారి అనునిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుందని తెలిపారు. 25వ తేదీ ఉదయం 8గంటలకు రివిట్‌మెంట్ కుంగితే మధ్యాహ్నం 1:30 గంటల వరకు అధికారి కొండన్న అక్కడకు చేరుకోలేదన్నారు. ఆయన కోసం రిజర్వాయర్ వద్ద నిరీక్షించామన్నారు.



బ్రిడ్జిని ఢీకొన్న లారీ దగ్ధం

క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ గంటపాటు నరకయాతన



మద్దూరు మెట్ట సమీపంలో దగ్ధమైన సిమెంట్ లోడ్ లారీ



చాగలమర్రి, సెప్టెంబరు 26: మండలంలోని మద్దూరు గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిలోగల బ్రిడ్జిని లారీ ఢీకొని గురువారం తెల్లవారుజామున దగ్ధమైంది. బనగానపల్లె నుంచి సిమెంట్ లోడ్‌తో తమిళనాడుకు వెళ్తున్న లారీ టయర్ పంక్చర్ కావడంతో అదుపు తప్పి మద్దూరు మెట్ట సమీపంలో బ్రిడ్జిని ఢీకొంది. వెంటనే మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ వేలే మురుగన్ క్యాబిన్‌లో ఇరుక్కపోయి గంటపాటు నరకయాతన అనుభవించాడు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేష్‌రెడ్డి, పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి డ్రైవర్‌ను బయటకు తీశారు. లారీని హైవే సిబ్బంది క్రేన్‌తో పక్కకు తరలించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు.

ఉపాధి హామీ పనులను పూర్తి చేయండి: కలెక్టర్




నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 26: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓలు, ఏపీడీలు, క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన లేబర్ బడ్జెట్, వంద రోజుల పని దినాల కల్పన, హార్టికల్చర్, అవెన్యూ ప్లాంటేషన్ పనులు, సంస్థాగత ప్లాంటేషన్ పనులు, బ్లాక్ ప్లాంటేషన్ పనులు, ఫారం పాండ్స్ రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్ పనులు, పశుసంపద షెడ్లు, ట్రెంచ్ పనుల ప్రగతి లక్ష్యాలపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్లస్టర్ల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులు గడువులోగా పూర్తి చేసేందుకు ఎంపీడీఓలు, ఏపీడీలు, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 55 ఫారం పాండ్ల తవ్వకానికి 42 పూర్తి చేశారని, 427 పశుసంపద షెడ్లకు 32 షెడ్లు పూర్తి చేశారన్నారు. ఫారంపాండ్లకు కొత్తపల్లి, బనగానపల్లి, ఉయ్యాలవాడ, మిడుతూరు, మండలాల్లో పశుసంపద షెడ్లను పాములపాడు, బనగానపల్లి, గడివేముల మండలాల్లో మిగిలివున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు.

సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టులకు దరఖాస్తులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 26: మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో పోస్టుల కోసం అర్హులైన అభ్యర్థినులు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ లీలావతి తెలిపారు. సెంటర్ అడ్మినిస్ట్రేటర్, కేసు వర్కర్, పారాలీగల్ పర్సనల్, సోషల్ కౌన్సిలర్ తదితర పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ తెలిపారు.

భద్రత పునరుద్ధరించండి

- హైకోర్టుకు మాజీ మంత్రి బుగ్గన
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి న్యాయస్థానం ఆదేశం



అమరావతి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మంత్రిగా ఉన్న సమయంలో తనకున్న వై ప్లస్ కేటగిరీ భద్రతను పునరుద్ధరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. అనంతరం విచారణను అక్టోబరు 16కు వాయిదా వేశారు. అంతకుముందు పిటిషనర్ తరపున న్యాయవాది సి.సుమన్ వాదనలు వినిపించారు. తన క్లయింట్‌కు ప్రాణహాని ఉందని, ఎలాంటి నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా భద్రతను తొలగించారన్నారు. దీనికి ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. పిటిషనర్ ప్రసుత్తం ఎలాంటి రాజ్యాంగ బద్ధ పదవిలో లేరని కోర్టుకు తెలిపారు. ఆయనకు ఎలాంటి ప్రాణహాని లేదని సెక్యూరిటీ రివ్యూ కమిటీ కూడా నివేదిక ఇచ్చిందని స్పష్టం చేశారు. దీనిపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు.

వ్యవసాయ మార్కెటింగ్ కమిటీస్ స్టాడింగ్ కౌన్సిల్‌గా రాజేశ్వరరావు



మహానంది, సెప్టెంబరు 26: వ్యవసాయ మార్కెటింగ్ కమిటీస్ స్టాండింగ్ కౌన్సిల్‌గా మహానందికి చెందిన హైకోర్టు న్యాయవాది గంగిశెట్టి రాజేశ్వరరావును నియమిస్తూ లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ ప్రభుత్వ సెక్రటరీ వి. సునీత గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల, కర్నూలు జిల్లాల స్టాండింగ్ కౌన్సిల్‌గా గంగిశెట్టి రాజేశ్వరరావు వ్యవహరిస్తారు.

జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్

నంద్యాల క్రైం, సెప్టెంబరు 26 : ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా గత ఐదు రోజులుగా విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు పోలీస్ అధికారులు గురువారం తెలిపారు. ఈ దాడుల్లో డ్రంకెన్ డ్రైవ్‌లో 92 కేసులు నమోదు చేసి 64 వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నవారిపై 417 కేసులు నమోదు చేశామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగుతున్న 240 మందిపై కేసులు నమోదు చేసి రూ.21,280 జరిమానా విధించినట్లు వెల్లడించారు. అలాగే మోటార్ వెహికల్ చట్టం ఉల్లంఘించిన వారిపై 2,332 కేసులు నమోదు చేసి రూ.10,77,093 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. నాటు సారా అమ్మే వారిపై 33 కేసులు నమోదు చేసి 165 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒక డీపీఎల్ కేసులో 25.2 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పీడీఎస్‌ను అక్రమంగా తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి అందులోని 12 బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డోన్ సబ్ డివిజన్ పరిధిలో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4,500, నాలుగు మోటార్‌సైకిళ్లు, రెండు పందెం కోళ్లు, ఆరు కోడి పందేలకు ఉపయోగించే కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి ఆరు కేసులు నమోదు చేసి 48 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.1,21,680 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో తనిఖీలు

కర్నూలు, సెప్టెంబరు 26: ఉమ్మడి జిల్లాలో విజిలెన్స్ అధికారులు పురుగులు, ఎరువుల మందుల దుకాణాల్లో గురువారం తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు సీఐలు పి. రామకృష్ణ, కే సునీల్, తహసీల్దార్ వెంకటనారాయణ, ఏవో రూపస్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు జిల్లాలోని ఆదోని మండలంలో శ్రీనందీశ్వర ట్రేడర్స్‌లో ఎంఆర్‌పీ ధరల కంటే ఎక్కువగా విక్రయిస్తున్నందున 3.375 టన్నులు సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. అలాగే ఆదిత్య ట్రేడర్స్‌లో 3.87 టన్నుల యూరియాను సీజ్ చేసి దుకాణంలో 130.25 టన్నుల ఎరువుల విక్రయాలను తాత్కాలిక నిలుపుదల చేశారు. అలాగే కల్లూరు మండలంలో ముకుంద ట్రేడర్స్ విజయలక్ష్మి ఎరువుల దుకాణాల్లో నిల్వలకు వ్యత్యాసం ఉన్నందున రూ.3.13 లక్షలు విలువ గల ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలిపేశారు. నంద్యాల జిల్లాలోని ఎర్రగుంట్ల, శిరివెళ్ల మండలాల్లో శ్రీశ్రీ ఎరువుల దుకాణంలో అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తుండటంతో 23.4 టన్నుల యూరియను సీజ్ చేశారు. అలాగే శ్రీగురు ఏజెన్సీస్‌లో రికార్డు స్టాక్‌లో వ్యత్యాసం ఉన్న కారణంగా రూ.9.98 లక్షల విలువ ఎరువుల విక్రయాలు నిలుపుదల చేశారు.

ఎక్సైజ్ డీసీగా పోతుల శ్రీదేవి



కలెక్టర్‌ను కలిసిన ఎక్సైజ్ శాఖ కమిషనర్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ డైరెక్టర్‌గా పోతుల శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎక్సైజ్ శాఖలో వచ్చిన మార్పులు, నూతన ఎక్సైజ్ విధానం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు, సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

బధిరులు మనోధైర్యంతో ముందుకు సాగాలి

విభిన్న ప్రతిభావంతుల ఏడీ రయిజ్ ఫాతిమా



సమావేశంలో మాట్లాడుతున్న బధిరులు సంక్షేమ శాఖ అధికారి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26: బధిరులు మనో ధైర్యంతో అన్ని రంగాల్లో విజయం సాధించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిజ్ ఫాతిమా అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవం, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ పథకాల శాఖ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం బధిరుల కోసం 2018-19 నుంచి 2022-23 వరకు 25 పోస్టులను నియామకం చేపట్టిందన్నారు. డాక్టర్ నాగ ప్రసాద్ మాట్లాడుతూ బధిరులు మనోధైర్యంతో గృహాల నుంచి బయటకు రావాలని, అందరూ విద్యను అభ్యసించాలని, సంఘాలుగా ఏర్పడి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చినట్లైతే పరిష్కరించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అంతకుముందు జిల్లా పరిషత్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ కార్యాలయం సూపరింటెండెంట్ సాల్మన్ రాజు, ఖాజా బధిరుల సంఘం వైస్ ప్రెసిడెంట్, ప్రభుత్వ బధిరుల ఉద్యోగుల సంఘం సభ్యులు వాసుదేవరెడ్డి, సాధిక్ బాషా, షకూర్ బాషా, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం రౌండ్ టేబుల్ సమావేశం

● దీక్షలు విజయవంతం చేయాలని వక్తల పిలుపు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 26: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అక్టోబరు 1, 2, 3 తేదీల్లో చేపట్టబోయే దీక్షలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాక్రిష్ణ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్మిక కర్షక భవన్లో సీఐటీయూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్మిక, రైతు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా నిర్మించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నష్టాల్లోకి నెట్టివేసి ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. 500 మంది ఉద్యోగులను పక్క రాష్ట్రాల ఫ్యాక్టరీలకు బదిలీ చేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని కోరారు. దీక్షలు విజయవతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ, శ్రీనివాసరావు, నాగన్న, లలితమ్మ, సోమన్న పాల్గొన్నారు.

పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 26: పారామెడికల్ కోర్సులకు రెండో ఫేజ్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే చిట్టినరసమ్మ తెలిపారు. పారా మెడికల్ కోర్సుల్లో చేరడానికి మొదటి ఫేజ్‌లో మూడు కౌన్సెలింగ్‌లు పూర్తి కాగా అందులో మిగిలిన సీట్లకు రెండో ఫేజ్ కింద అడ్మిషన్ల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇంటర్ విద్యార్హత కలిగిన వారికి సంబంధించిన రోస్టర్ కేటగిరికి చెందిన విద్యార్థులు రూ.100 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని, అక్టోబరు 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి అక్టోబరు 9 ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. సీట్లు రోస్టర్ వివరాలు ఇలా ఉన్నాయి. డార్క్ రూం అసిస్టెంట్ కోర్సులో బీసీ(ఏ)కి ఒక సీటు బీసీ(డీ)కి ఒక సీటు, ఓసీ-ఈడబ్ల్యూఎస్‌కు 1, డీఎంఐటీ కోర్సులో ఎస్టీకి 1, డీఆర్‌జీఏ కోర్సులో ఓసీ-ఈడబ్ల్యూఎస్‌కి 1, డీఏఎన్ఎస్ కోర్సులో ఓసీ (ఓపెన్ కేటగిరి)కి 1, బీసీ-సీకి 1 సీటు అందుబాటులో ఉన్నాయన్నారు. రోస్టర్ కేటగిరి కలిగిన అభ్యర్థులు బైపీసీ చదివినవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పొలంలో భారీ గుంత

బేతంచెర్ల, సెప్టెంబరు 26: మండలంలోని ఎంబాయి గ్రామానికి చెందిన కరుణాకరప్ప పొలంలో మామిడి చెట్ల మొద్దులు ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తుండగా ఓ పెద్ద గుంత బయటపడింది. ఈ లోతైన గుంత ఉన్న విషయం ఆ నోట ఈ నోట చేరి గ్రామాల ప్రజలకు తెలియడంతో తిలకించేందుకు ప్రజలు బారులుగా తరలివచ్చి తిలకిస్తున్నారు. పొలంలో గుంత ఉండటంతో ఆశ్చర్యంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



మొద్దులు తొలగిస్తుండగా.. పొలంలో కనిపించిన గుంత

పత్తికొండ, కర్నూలు ఆర్డీఓలు బదిలీ

కర్నూలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ, కర్నూలు ఆర్డీఓలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డిని జీఏడీలో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. కాగా కర్నూలు ఆర్డీఓగా విజయనగరం జిల్లా బీసీ వెల్ఫేర్ ఈఓగా పనిచేస్తున్న కిడారి సందీప్ కుమార్ బదిలీ అయ్యారు. ఇక పత్తికొండ ఆర్డీఓ ఎస్.రామలక్ష్మి కూడా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాజమహేంద్రవరంలో టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్.భరత్ నాయక్ నియమితులయ్యారు. కాగా రామలక్ష్మి రేపల్లె ఆర్డీఓగా బదిలీ అయ్యారు.

శాంతి భద్రతలే లక్ష్యం

- నిజనిర్ధారణ చేసుకుని కేసులు నమోదు చేయాలి
- శాంతి భద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకోవాలి
- డీఐజీ కోయ ప్రవీణ్
- ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంసా పత్రాలు, రివార్డులు ప్రదానం

కర్నూలు, సెప్టెంబరు 26: జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు పనిచేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశించారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ బిందు మాధవ్‌తో కలిసి డీఐజీ జిల్లాలోని సబ్ డివిజన్ డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ కర్నూలు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించారు. పోలీస్ స్టేషన్ల వారిగా కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో అల్లరిమూకలు, ఫ్యాక్షన్ చరిత్ర కలిగిన వారిపై గట్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బైండోవర్ చేస్తూ వారి ప్రవర్తనపై భవిష్యత్తులో నిఘా ఉంచాలన్నారు. ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైతే రౌడీషీట్లు నమోదు చేయాలని ఆదేశించారు. రాబరీ, డెకాయిట్ వంటి గ్రేవ్ కేసులపై దర్యాప్తులు పకడ్బందీగా చేయాలని సూచించారు. ప్రాపర్టీ, చీటింగ్, సైబర్ ఫ్రాడ్స్ కేసులలో ఫిర్యాదులు వస్తే వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్లను ఆశ్రయించే వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. నాటుసారా తయారు చేసే వారిపై కేసులు నమోదు చేయాలని, సారా బెల్లం అమ్మేవారిపై కూడా కేసులు నమోదు చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. లాంగ్ పెండింగ్ కేసుల గురించి సబ్ డివిజన్ల వారిగా అడిగి తెలుసుకున్నారు. విధుల్లో ప్రతిభ కనబరిచిన పోలీసులకు సిబ్బందికి ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులు అందజేశారు.

ప్రశంసా పత్రాలు, రివార్డులు అందుకున్న వారు:

● సీసీఎస్ పోలీసులు:

కర్నూలు తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో కాపర్‌వైర్, ట్రాన్స్‌ఫార్మర్ రికవరీ, ఆయిల్ దొంగతనం కేసులను గుర్తించడంలో జిల్లాలోని ఇతర 23 కేసులలో నిందితులను గుర్తించడంతో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ పోలీసులు సీఐ పి. శేషయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎంవీ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు ఎస్.నాగరాజు, యు.దేవరాజు, జే. శేఖర్.

● సైబర్ ల్యాబ్ పోలీసులు:

కాపర్ వైర్ అండ్ ట్రాన్స్‌ఫార్మర్, మొబైల్ రికవరిలో ప్రతిభ కనబరిచిన సైబర్ ల్యాబ్ పోలీసులు సీఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్స్ రాజేశ్వర్ రెడ్డి, చాంద్‌బాషా, దేవనాయుడు, పి. తిరుమలరావు, యు. వెంకట్రాజు, కిరణ్ కుమార్, మహేశ్వర్ సింగ్.

● కర్నూలు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు ఛేదించడంలో మంచి ప్రతిభ కనబరిచి సీఐ మురళిధర్ రెడ్డి, ఎస్ఐ మన్మధ విజయ్, కానిస్టేబుళ్లు రంగారావు, కిషోర్, వీరేష్, తిరుమలేష్.



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్, పక్కనే ఎస్పీ జి.బిందుమాధవ్

● లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో:

డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐలు, నాగరాజరావు, బి.మధుసూదన్‌గౌడు, రామయ్యనాయుడు.

● వినాయక నిమజ్జనం విధుల్లో ప్రతిభ కనబరిచిన స్పెషల్ బ్రాంచ్ వారికి, కమ్యూనికేషన్ పోలీసులకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఎస్ఐలు, హనుమంతు, వేణుగోపాల్‌రాజు, ఏఎస్ఐలు, మౌలాలి, అజ్మతుల్లా, లక్ష్మీనారాయణ, వీరేంద్ర, ఈశ్వర్ రెడ్డి, అస్లాంబాషా, కమ్యూనికేషన్ సీఐ మనోహర్, హెడ్ కానిస్టేబుల్ పరమేష్.

● డీసీఆర్‌బీ పోలీసులకు జిల్లా క్రైమ్ రికార్డులలో ప్రతిభ కనబరిచిన డీసీఆర్‌బీ సీఐ గుణశేఖర్‌బాబు, పోలీసులు ఫారూఖ్‌బాషా, ఆచారి, బాబా, రామచంద్రుడులకు ప్రశంసాపత్రాలు, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, డీఎస్పీలు వెంకట్రామయ్య, శ్రీనివాసరాచారి, సోమన్న, ఉపేంద్రబాబు, శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

జల వనరుల శాఖలో బదిలీలు

- కర్నూలు ఇన్‌చార్జి ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి అనంతపురం జిల్లాకు
- డీఎస్ఈగా బాలచంద్రారెడ్డి నియామకం
- ఈయనకే ఎస్ఈ ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చే అవకాశం
- టీబీపీ ఎల్లెల్సీ ఆదోని డివిజన్ ఈఈగా పాండురంగయ్య



ఆదోని డివిజన్ ఈఈగా పాండురంగయ్య

కర్నూలు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జలవనరుల శాఖలో పని చేస్తున్న ఇంజనీర్లను గురువారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ శాఖ ఈఎన్‌సీ సిఫారసు మేరకు ఈ బదిలీలు చేశారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పని చేస్తున్న పలువురు ఈఈలను ఇతర వివిధ జిల్లాలకు బదిలీ చేసింది. అదే క్రమంలో ఆయా జిల్లాల్లో పని చేస్తున్న ఈఈలను కర్నూలు, నంద్యాల జిల్లాల్లో వివిధ ప్రాజెక్టుకు బదిలీ చేశారు. కర్నూలు మైనర్ ఇగిరేషన్ (ఎంఐ) డివిజన్ ఈఈ విధులు నిర్వహిస్తూ కర్నూలు ఇగిరేషన్ సర్కిల్ ఎస్ఈ (ఎఫ్ఏసీ)గా కొనసాగుతున్న రెడ్డి శేఖర్‌రెడ్డిని అనంతపురం జిల్లా హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎంఐ ఈఈగా శ్రీశైలం ప్రాజెక్టు ఈస్ట్ నిర్వహణ డివిజన్ ఈఈ జి. శ్రీనివాసులను నియమించారు. గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు ఐసీ ఎస్ఈ ఇన్‌చార్జి బాధ్యతలు రెడ్డి శేఖర్‌రెడ్డికి ఇవ్వడం కోసం జి. శ్రీనివాసులను బలవంతంగా బదిలీ చేశారు. తాజాగా రెడ్డి శేఖర్‌రెడ్డి బదిలీ కావడం.. అదే స్థానంలోకి జి. శ్రీనివాసులు రావడం ఆ శాఖలో ప్రధానంగా చర్చనీయాంశంగా మారింది.

● ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈగా బాలచంద్రారెడ్డి..?:

కర్నూలు జలవనరుల సర్కిల్ ఎస్ఈ అదనపు బాధ్యతలు చూస్తున్న ఎంఐ ఈఈ రెడ్డి శేఖర్‌రెడ్డి అనంతపురం జిల్లాకు బదిలీ అయ్యారు. కడప జిల్లా ఎంఐ డివిజన్‌లో పని చేస్తున్న బాలచంద్రారెడ్డిని కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా నియమించారు. ఆయనకే ఎస్ఈ ఇన్‌చార్జి (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. అధికారికంగా ఉత్తర్వులు వచ్చే వరకు రెడ్డిశేఖర్‌రెడ్డినే ఇన్‌చార్జి ఎస్ఈగా కొనసాగే అవకాశం ఉంది. అలాగే.. పోలవరం ప్రాజెక్టు ధవళేశ్వరం డివిజన్ ఈఈగా పని చేస్తున్న పి. పాండురంగయ్యను తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ ఆదోని డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఎల్లెల్సీ-3 డివిజన్ డీఈఈ శైలేశ్వర్ ఎల్లెల్సీ ఈఈ ఇన్‌చార్జిగా ఉన్నారు.

● ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇరిగేషన్ ఈఈల బదిలీ వివరాలు

ఈఈ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి. రెడ్డి శేఖర్‌రెడ్డి	ఎంఐ డివిజన్, కర్నూలు	హెచ్చెల్సీ డివిజన్, అనంతపురం జిల్లా
జి. శ్రీనివాసులు	శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ డివిజన్	ఎంఐ డివిజన్, కర్నూలు
బి. బాలచంద్రారెడ్డి	ఎంఐ డివిజన్, కడప	డిప్యూటీ ఎస్ఈ, ఇరిగేషన్ సర్కిల్, కర్నూలు
పి. పాండురంగయ్య	పోలవరం ప్రాజెక్ట్, ధవళేశ్వరం	టీబీపీ ఎల్లెల్సీ డివిజన్, ఆదోని
పి. నాగరాజురావు	ఎస్ఆర్‌బీసీ క్యూసీ డివిజన్-2 నంద్యాల	ఇరిగేషన్ డివిజన్, నిడదవోలు, గోదావరి డెల్టా
ప్రతాప్ చిరుతాని	ఐబీ డివిజన్, అనంతపురం	కేసీ కెనాల్ డివిజన్, నంద్యాల
కె. మల్లికార్జున	కెడబ్ల్యూ డివిజన్, తెనాలి	శ్రీశైలం ప్రాజెక్టు ఈస్ట్ నిర్వహణ డివిజన్, శ్రీశైలం
ఎల్ఎన్ ప్రసాద్ మేడసాని	ఎస్ఆర్‌బీసీ డివిజన్-2, పాణ్యం	డీఎస్ఈ, ఎస్ఆర్‌బీసీ ఎస్ఈ ఆఫీస్ సర్కిల్-2, నంద్యాల
బి. రాజేంద్రప్రసాద్	ఎస్ఆర్‌బీసీ-1, నంద్యాల	ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ, కర్నూలు
ఎస్. లక్ష్మణ్‌నాయక్	డీసీఈ, ప్రాజెక్ట్స్ సీఈ ఆఫీస్, కర్నూలు	శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ ఈస్ట్ డివిజన్, శ్రీశైలం

భూసేకరణ, అటవీ క్లియరెన్సులు పూర్తి చేయండి : మంత్రి బీసీ



రాష్ట్ర స్థాయి అధికారులతో మాట్లాడుతున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 26: నేషనల్ హైవే ప్రాజెక్టుల భూసేకరణ, అటవీ క్లియరెన్సులను గడువు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడలోని రోడ్లు, భవనాల శాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో ఉన్నతస్థాయి కమిటీ సమీక్షా సమావేశం మంత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం జాతీయ రహదారులకు రూ.58,817 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులకు గాను 2,594 కిలో మీటర్ల రహదారుల పనులు కొనసాగుతున్నాయన్నారు. అయితే వీటిలో 59 ప్రాజెక్టుల భూసేకరణ సమస్యలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ భూములను కాంట్రాక్టు ఏజెన్సీలను అప్పగించడానికి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లకు అవసరమైన సూచనలను జారీ చేశారు. అటవీ క్లియరెన్సు సమస్యలను కూడా మంత్రి సమీక్షించారు. అటవీ క్లయరెన్సు సమస్యల పరిష్కారానికి కర్నూలు, కడప, ప్రకాశం, సత్యసాయి, అన్నమయ్య, నెల్లూరు జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మంత్రి మాట్లాడారు. ప్రతి బుధవారం కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి భూసేకరణ క్లియరెన్సుల పురోగతిని సమీక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే, ల్యాడ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ రామచంద్ర, అధికారులు నేషనల్ హైవే అధికారులు రాకేశ్‌కుమార్, ఆర్‌కె సింగ్, శేషకుమార్, అటవీశాఖ అసిస్టెంట్ కమిషనర్ దీప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేముగోడు, హెచ్ కైరవాడి గ్రామాల్లో డెంగీ కేసులు

గోనెగండ్ల, సెప్టెంబరు 26: మండల పరిధిలోని వేముగోడు, హెచ్ కైరవాడి గ్రామాలలో ఇద్దరి వ్యక్తులకు డెంగీ సోకినట్లు జిల్లా మలేరియా యూనిట్ అధికారి నూకరాజు తెలిపారు. దీంతో గురువారం గోనెగండ్ల వైద్యాధికారులు, జిల్లా మలేరియా అధికారి నూకరాజు వేముగోడు, హెచ్ కైరవాడి గ్రామాలను చేరుకొని డెంగీ సోకిన వారి ఇళ్లలో దోమలు ప్రబలకుండా మందును పిచికారి చేశారు. అలాగే వీధిలోని వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. అలాగే వ్యాధిగ్రస్తుల ఇళ్ల పరిసరాలలో దోమలు ప్రబలకుండా ద్రావణం పిచికారి చేయించారు. గ్రామంలోని పలు వీధుల్లో మురుగు నీరు నిలువ ఉన్న ప్రాంతంలో దోమల నివారణ మందును పిచికారి చేశారు. గ్రామంలో ఎవరైనా అనారోగ్యం ఉన్నట్లు తెలిస్తే వెంటనే గోనెగండ్ల ప్రభుత్వ అనుపత్రికి రావాలిని వైద్య సిబ్బంది గ్రామస్థులకు సూచించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఆశా వర్కర్లు వెళ్లి లార్వా పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సాయిబాబా, వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామంలో మురికినీటి తొలగిస్తున్నపంచాయతీ సిబ్బంది

బాలికపై అత్యాచారం

● యువకుడిపై కేసు నమోదు

మిడ్తూరు, సెప్టెంబరు 26: బాలికపై అత్యాచారం చేసిన ఓ యువకుడిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. మిడ్తూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వడ్డె ఎల్ల రాజు అనే యువకుడు అదే గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారం చేశాడు. తల్లి లేకపోవడంతో ఆ బాలిక తన అత్త, పిన్నిల వద్ద ఉంటూ కూలీ పనికి వెళ్లేది. వారం రోజుల నుంచి అనారోగ్యం కారణంగా ఇంటి వద్ద ఉంటోంది. మధ్యాహ్న సమయంలో వడ్డె ఎల్ల రాజు బలవంతంగా బాలికను తీసుకొని వెళ్లి అత్యాచారం చేశాడు. బయట ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. మంగళవారం ఉదయం 11 గంటలకు బాలిక ఇంట్లో ఉండగా బలవంతం చేయబోయాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో బాలిక కేకలు విన్న ఆమె సోదరుడు వచ్చి తలుపులు తోశాడు. రాజు తలుపులు తీసి అతడ్ని తోసి అక్కడి నుంచి పారిపోయాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు అత్యాచారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

వీఆర్వో మద్దిలేటి సస్పెన్షన్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 26: గతంలో కల్లూరు మండలంలో పని చేసి ప్రస్తుతం దేవనకొండ మండలం తెర్నేకల్-2 గ్రామ వీఆర్వోగా పని చేస్తున్న కే మద్దిలేటిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా సస్పెండ్ చేశారు.

29న రేబిస్ నివారణ దినం

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 26: ఈ నెల 28న లూయిస్ పాశ్చర్ వర్ధంతిని పురస్కరించుకుని ప్రపంచ రేబిస్ నివారణ దినం జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్ వైద్యాధికారులను ఆదేశించారు. ముఖ్యంగా కుక్కలు, కోతులు వంటి పెంపుడు జంతువులు కరవడం వల్ల రేబీస్ వ్యాధి సోకుతుందన్నారు. ప్రజలు పెంపుడు జంతువుల నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముందస్తు వ్యాక్సినేషన్ తప్పనిసరిగా చేయించాలన్నారు.

ఎమ్మిగనూరు ఆస్పత్రి సూపరింటెండెంట్ సస్పెండ్

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 26: విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో పాటు శిశువు మృతికి కారణమైందంటూ ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మైత్రేయిపై డీసీహెచ్ డాక్టర్ మాధవి సస్పెన్షన్ వేటు వేశారు. గురువారం డీసీహెచ్ మాధవికి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమెపై వచ్చిన అనేక ఆరోపణల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని తేల్చారు. ఈ మేరకు విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. అలాగే ఆమెస్థానంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుధా అయ్యగారిని నియమించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని నల్లకాలువ గ్రామానికి చెందిన డానియేలు(48) అనే రైతు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. డానియేలు గ్రామ శివార్లలోని తన మొక్కజొన్న పంటకు నీరు పెట్టేందుకు గురువారం సాయంత్రం పొలానికి వెళ్లారు. ఈ క్రమంలో పొలంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందారు.

టూరిస్ట్ డార్మెటరీ లీజుకు వేలం ప్రకటన

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 26: నంద్యాల జిల్లా పర్యాటక శాఖ ఆధీనంలోని యాగంటి క్షేత్రం వద్ద ఉన్న టూరిస్ట్ డార్మెటరీ లీజుకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణరావు తెలిపారు. అక్టోబరు 1వ తేదీన కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులోని ఏపీ టూరిజం అథారిటీ కార్యాలయంలో బహిరంగ వేలంపాట ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు వివరాలకు ఫోన్ 7995087089, 8297092022 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన సుబ్బారెడ్డి


మంత్రి ఫరూక్‌ను కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 26: రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను గురువారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ నాయకుడు, ఏపీ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుబ్బారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రిని పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, రైతులు

పాములపాడు, సెప్టెంబరు 26: మండలంలోని ఇస్కాల గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు టీడీపీ నాయకులు నాగలక్ష్మిరెడ్డి, రాము, లింగస్వామి, వెంకటరెడ్డి, కలీముల్లా ఆధ్వర్యంలో గురువారం క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ముంపునకు గురైన పంట నష్ట పరిహారం సొమ్మును అతి తక్కువ సమయంలోనే రైతుల ఖాతల్లో జమ కావడంతో కృతజ్ఞతగా రైతుల సమక్షంలో క్షీరాభిషేకం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో నష్టపోయిన మొక్కజొన్న, మిరప తదితర పంటలకు ఎకరాకు రూ.6 వేలు చొప్పున 1500 ఎకరాలకు నష్ట పరిహారం ఖాతాల్లో జమ అయిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పెద్ద శ్రీనివాసులు, సామన్న, రాముడు, నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

డీఐజీని కలిసిన సివిల్ సప్లైస్ డైరెక్టర్


డీఐజీ ప్రవీణ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బోయ మహేశ్

నంద్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితుడైన తలముడిపి మహేశ్ నాయుడు కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్‌ను ఆయన బంగ్లాలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ ప్రభుత్వంలో సివిల్ సప్లైస్ శాఖ అంతా అవినీతి మయంగా మారిందని అన్నారు. పేదలకు అందాల్సిన బియ్యం పక్కదారి పట్టిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ తప్పులను సరిదిద్దే చర్యలు చేపడుతోందని, ఆ శాఖ కార్పోరేషన్‌లో ఓ డైరెక్టర్‌గా నియమితుడైన తాను జిల్లాలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఉండేందుకు పాటు పడతానని అన్నారు. ఇందుకు తమ సహకారం కావాలని డీఐజీని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన డీఐజీ అన్ని విధాలుగా సహకరిస్తానని చెప్పినట్లు మహేశ్ తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

పగిడ్యాల, సెప్టెంబరు 26: మండలంలోని ప్రాతకోట గ్రామానికి చెందిన ఎం.అంకన్న (70) అనే టీడీపీ కార్యకర్త గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గ్రామానికి చేరుకొని మృతదేహానికి పూల మాలలు వేసి సంతాపం తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు నాగశేషులు, వెంకటరెడ్డి, రమణ, బాలీశ్వర్‌గౌడ్, ఆశోక్, దత్తు తదితరులు ఉన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

మహానంది: మహానంది గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు సూరే శ్రీనివాసులు(54) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. శ్రీనివాసులు మృతదేహానికి టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి, చంద్ర మౌళీశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, గోపవరం గని చిన్న రంగస్వామి, మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు నివాళి అర్పించారు.

ల్యాబ్ టెక్నీషియన్ మృతి

కొత్తపల్లి, సెప్టెంబరు 26: కొత్తపల్లి పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న పల్లె సత్యం (56) అనే వ్యక్తి గుండె జబ్బుతో గురువారం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందారు. కొత్తపల్లి పీహెచ్‌సీలో 8 ఏళ్లుగా ల్యాబ్ టెక్నీషియన్‌గా ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించిన సత్యం అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు మహ్మద్ భేగ్, దీపా నాగవేణి అన్నారు. వైద్యాధికారులు మహ్మద్ బేగ్, దీపా నాగవేణి, వైద్య సిబ్బంది సత్యం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ప్రభుత్వం తరుపున దహన సంస్కారాల కోసం రూ.25వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

మిడుతూరు, సెప్టెంబరు 26: పీరుసాహేబ్ పేట గ్రామంలో రెండు వర్గాలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పీరుసాహేబ్‌పేటలో మధుగోపాల్ అనే వ్యక్తి బైక్‌ను బోయ శివకృష్ణ తన బైక్‌తో తగిలించాడు. ఈ విషయంపై అదేగ్రామానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి బోయ శివకృష్ణను మందలించారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు అక్కడకు చేరుకుని వారిని అదుపులోకి తీసుకుని ఇరు వర్గీయులను మిడుతూరు పోలీస్ స్టేషకు తీసుకొచ్చారు. ఎడమకంటి విష్ణువర్ధన్ రెడ్డి, మర్రికుంట మహేశ్వర రెడ్డి, కుంచెపు మదనగోపాల్, ఎడమకంటి మురళీధర్ రెడ్డి, మర్రికుంట రంజిత్ రెడ్డి, పిక్కిలి బోయ శివకృష్ణ, పిక్కిలి వెంకటనాయుడు, పిక్కిలి శ్రీనివాసులు, పిక్కిలి వెంకట రామనాయుడు, బోయ బలరాముడుపై పోలీసుల ప్రత్యేక రిపోర్టు మేరకు కేసున'మోదు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు తెలిపారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 26: అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నరసింహనాయక్, మహబూబ్‌బాషా, శివుడు, అంబయ్య, రామసుబ్బయ్య, నాగన్న, దర్గయ్య తదితరులు ఉన్నారు.

ట్యాంకర్ బోల్తా.. ఒకరికి గాయాలు

పాములపాడు, సెప్టెంబరు 26: పాములపాడు గ్రామ శివార్లలో లారీ ట్యాంకర్ బోల్తా పడటంతో ఆంజనేయులు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం విజయవాడ నుంచి బళ్ళారికి సున్నం ట్యాంకర్ బయలు దేరింది. గురువారం తెల్లవారుఝామున పాములపాడు శివారులోని హైస్కూల్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడటంతో లారీలో ప్రయాణిస్తున్న ఆంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు ఖాజ, సుబ్బారావులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 26: నంద్యాల జిల్లా రజక సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం చాకలి ఐలమ్మ 129వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణలో రైతులు పండించిన పంటను బ్రిటీష్ పాలకులు దోచుకుంటున్న సందర్భంగా వారికి ఎదురొడ్డ నిలబడిన వీర నారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం అధ్యక్షుడు నాగరాజు, గౌరవ అధ్యక్షుడు నాగేంద్ర, కంభగిరి స్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా రాష్ట్రం

- ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చర్యలు
- 'ఇది మంచి ప్రభుత్వం'లో ప్రజాప్రతినిధులు, అధికారులు


నంద్యాలలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు


మహానంది: గాజులపల్లి ఆర్ఎస్‌లో..


నందికొట్కూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య


జూపాడుబంగ్లా: తర్తూరులో..


బండిఆత్మకూరు: బి.కోడూరులో..


కొత్తపల్లి: నందికుంటలో..

నందికొట్కూరు, సెప్టెంబరు 26: గత ఐదేళ్ల వైసీపీ పాలనతో సంక్షోభంలో ఉన్న రాష్ట్రం నేడు కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి దిశగా పయనిస్తోందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ బేబి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ రబ్బాని, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కౌన్సిలర్లు నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయలేదన్నారు. వైసీపీ హయాంలో అన్న క్యాంటీన్లను జగన్ నిలుపుదల చేశారన్నారు. అయితే నేడు కూటమి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించి పేదల కడుపు నింపుతోందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి రైతులలో నెలకొన్న భయాందోళనలను చంద్రబాబు తొలగించారన్నారు. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లను ఇస్తామన్న హామీని దీపావళి నుంచి అమలు చేస్తారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసే దిశగా చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారన్నారు. ఐసీడీఎస్ ఏపీడీ కోటేశ్వరమ్మ, బీజేపీ నాయకుడు దామోదర్‌రెడ్డి, జనసేన నాయకుడు నల్లమల రవికుమార్, కౌన్సిలర్లు జాకీర్ హుస్సేన్, భాస్కర్‌రెడ్డి, మందడి వాణి, సుమలత, చాంద్‌బాష, లాలు ప్రసాద్, టీడీపీ నాయకులు మూర్తుజావళి, వేణుగోపాల్, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరు, పారుమంచాల గ్రామాల్లో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, రమణారెడ్డి అన్నారు. మాజీ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచ్ ప్రకాశం, నాయకులు నబీరసూల్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణ, సన్ని, జనార్దన్, ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: నందికుంట గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకుడు మల్లెల కృష్ణారెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు జహరుల్లా, మధుసూదన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వో కృష్ణారెడ్డి షమీవుల్లా, మహేష్, ప్రవీణ్ కుమార్, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్: పేదల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని టీడీపీ రాష్ట్ర యువ నాయకుడు ఎన్ఎండీ ఫయాజ్ అన్నారు. గురువారం నందమూరినగర్‌లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టీడీపీ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో 37వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ కౌన్సిలర్ మామిడి ఉషారాణి, నాగరాజ్ కుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మణియార్ ఖలీల్, కౌన్సిలర్ నాగార్జున, తాటికొండ బుగ్గరాముడు, టీడీపీ నాయకులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: గాజులపల్లి ఆర్ఎస్, యి.బొల్లవరం, అల్లీనగరం, శ్రీనగరం గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మధు, గాజులపల్లి ఆర్ఎస్ సర్పంచ్ అస్లాం బాషా, టీడీపీ నాయకులు శ్యామల జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు యాదవ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: బి.కోడూరు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ డాక్టర్ భరద్వాజశర్మ, బాలుడు, చలమయ్య, కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి'


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా

నంద్యాల రూరల్, సెప్టెంబరు 26: ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నంద్యాల ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా సూచించారు. నేషనల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వేణు గోపాల్ అధ్యక్షతన విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్‌పై అవగాహన కలిగి డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు సంబంధించిన పత్రాలు అందు బాటులో ఉంచుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులకు, వాహన యజమానులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేషనల్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

నంద్యాల క్రైం, సెప్టెంబరు 26: పాణ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు, ప్రమాదాల నివారణపై గురువారం పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, ఓవర్‌లోడ్‌తో ప్రయాణం చేయరాదని, డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను ఎక్కించుకో కూడదని పోలీసులు ఆటో డ్రైవర్లకు సూచించారు. అనంతరం ఆటోలకు సీరియల్ నెంబర్లు ఇచ్చారు. పాణ్యం సీఐ, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

కొత్తపల్లి, సెప్టెంబరు 26: ఈరమ్మ అనే గర్భిణి విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, నక్కస్వాములు జిల్లా వైద్యాధికారులను డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ నెల 21న కొత్తపల్లి చెంచుగూడెం చెందిన నిండు గర్భిణి గిరిజన ఈరమ్మ ప్రసవం కోసం కొత్తపల్లి పీహెచ్‌సీకి వచ్చారని చెప్పారు. అయితే.. అక్కడి సిబ్బంది కాన్పు చేయకుండా నిర్లక్ష్యంగా ఆత్మకూరు సీహెచ్‌సీకి వెళ్లాలని చెప్పడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే పురిటినొప్పులతో బాధపడుతున్న గిరిజన మహిళను ఆసుపత్రిలో చేర్చుకోకపోవడంతో ఆసుపత్రి మెట్ల వద్దనే డెలివరి అయిందని మండిపడ్డారు. వైద్యాధికారులు దీపానాగవేణి, మహ్మద్ బేగ్‌ను వివరణ కోరగా.. వైద్యుల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా తాము కూడా సమ్మెలో పాల్గొనడంతో విధుల్లో లేమని చెప్పారు. ఆ సమయంలో వైద్య సిబ్బంది గిరిజన మహిళకు సహకరించినప్పటికీ వారిపై బాధిత మహిళ ఈరమ్మ కుటుంబ సభ్యులు సీపీఎం నాయకులకు తప్పుడు సమాచారం ఇచ్చారని వైద్య సిబ్బంది తెలిపారు.

'ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 26: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సమయ పాటించి సకాలంలో హాజరు నమోదు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు బాలాజీనాయక్, సురేష్ సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047కు సంబంధించి శనివారం మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, డిబేట్ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నందికొట్కూరు, సెప్టెంబరు 26: నందికొట్కూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ బేబి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె సూచించారు.

'పీఎఫ్ బకాయిలు చెల్లించాలి'

ఆత్మకూరు, సెప్టెంబరు 26: ఆత్మకూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు 2016 నుంచి రావాల్సిన పీఎఫ్ పెండింగ్ బకాయిలు చెల్లించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, పెద్దనాగరాజు, తిమ్మయ్య, రాజు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు రాజేంద్ర, నాగప్రసాద్, రమేష్, స్వాములు, నాగన్న, విజయకుమార్, సురేష్, సువర్ణమ్మ, దేవమ్మ, సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

'సుస్థిరాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం'

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 26: రాష్ట్రాన్ని సుస్థిరాభివృద్ధి వైపు పయనించే విధంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం విజన్ స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాన్ని చేపడుతోందని శ్రీశైలం నియోజక వర్గ ప్రత్యేకాధికారి తులసి దేవి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో సమావేశ భవనంలో గురువారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి స్వర్ణాంధ్ర కార్యక్రమానికి ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీడీవో మోహన్‌కుమార్, వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పక్కీరయ్య హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరరెడ్డి,ఏపీవో నాగమ్మ,వెలుగు, ఐసీడీఎస్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ దీక్షకు మద్దతుగా పూజలు


పూజలు చేస్తున్న జనసేన నాయకులు

వెలుగోడు, సెప్టెంబరు 26: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దీక్షకు మద్దతుగా కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు గురువారం వెలుగోడు పట్టణంలో లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో టీడీపీ మాజీ సర్పంచ్ అబ్దుల్‌కలాం, టౌన్ ప్రెసిడెంట్ ఖలీల్, శంకర్‌రెడ్డి జన సేన నాయకులు శాలుబాషా, సుకన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి నాయకులు ప్రసన్న, వలి, అంకరావు అభిమానులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

వెలుగోడు, సెప్టెంబరు 26: 34వ జాతీయస్థాయి పోటీలకు వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు హెచ్ఎం సత్యనారయణ తెలిపారు గురువారం ఆయన మాట్లాడుతూ తొమ్మిదో తరగతి చదువుతున్న శిరీషకు ఈ నెల 28 నుండి అక్టోబర్ తేది వరకు జార్ఖండ్ లో నిర్వహించే జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టులో పాల్గొనే అవకాశం దక్కిందని చెప్పారు. ఫిజికల్ డైరెక్టర్ సురేశ్‌నాయుడుని సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

'స్వచ్ఛతా హి సేవా'లో భాగస్వాములు కావాలి

బండిఆత్మకూరు, సెప్టెంబరు 26: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని సర్పంచ్ కాశూరి స్వేతకుమారి అన్నారు. గురువారం మండలంలోని ఎర్రటుంట్ల గ్రామంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సర్పంచ్ చెత్త సంపద సృష్టి కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రఘుస్వామిరెడ్డి, ప్రసాద్, నాగిరెడ్డి సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసులను ఛేదించాలి: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నంద్యాల క్రైం, సెప్టెంబరు 26: బాల, బాలికల మిస్సింగ్ కేసుల్లో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని వారి ఆచూకీ తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. గురువారం నంద్యాల సబ్ డివిజన్‌కు సంబంధించిన నేర సమీక్షా సమావేశం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నిర్వహించారు. జిల్లాలో నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రాధాన్యత క్రమంలో వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ బాధితులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సూచించారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్ కేసులు వాటి స్థితిగతులపై ఆరాతీశారు. అనంతరం పెండింగ్ కేసులకు సంబంధించిన ఫైళ్లను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. నిందితులకు శిక్ష పడాలన్నా.. బాధితులకు న్యాయం జరగాలన్నా నేర ఘటనా స్థల పరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్ట్, దర్యాప్తు, చార్జిషీటు దాఖలు, కోర్టు ట్రయల్స్ వరకు సిబ్బంది ఎలా వ్యవహరించాలన్న దానిపై ఎస్పీ అవగాహన కల్పించారు. పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం చిన్నపాటి సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలన్నారు. బీట్స్ రీ ఆర్గనైజ్ చేసి పట్టణాలతోపాటు మారుమూల ప్రాంతాలకు సైతం బీట్స్ తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణలో బేదాల్లేకుండా పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను తేలికగా తీసుకోవద్దన్నారు. పీజీఆర్ఎస్ పిటీషన్లపై నిర్దేశిత గడువులోగా చర్యలు తీసుకోవాలని, వాటిని జిల్లా పోలీస్ కార్యాలయానికి కూడా పంపాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నంద్యాల సబ్ డివిజన్‌కు సంబంధించి నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది మారుతున్న చట్టాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నంద్యాల డీఎస్పీ యుగంధర్‌బాబు, ఇన్‌స్పెక్టర్లు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్, ఆదినారాయణ, ప్రియతంరెడ్డి, సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

'ఉద్యాన పంటల సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 26: ఉద్యాన పంటల సాగు లక్ష్యాన్ని చేరుకుందామని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు సూచించారు. గురువారం నంద్యాలలోని జిల్లాఉద్యానశాఖ కార్యాలయంలో దిగువశ్రేణి అధికార యంత్రాంగంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2024..25 వసంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంలో అనుసరిస్తున్న విధానాలను వివరించారు. సమగ్ర ఉద్యాన పంటల పథకంలో భాగంగా ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. స్వర్ణాంధ్ర 2047ను దృష్టిలో ఉంచుకుని మండలాల వారిగా చేపట్టాల్సిన సాగు వివరాలను ఈనెల చివరిలోగా అందజేయాలని ఆదేశించారు. ఆయిల్ ఫామ్ సాగు జిల్లాలో 400 హెక్టార్లు లక్షంగా నిర్దేశించామని, జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 100 హెక్టార్లలో సాగు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాకు 70 ప్యాక్ హౌసులు, కోల్డ్ రూములు ఐదు, అరటి శీతలీకరణ గదులు ఆరు మంజూరయ్యాయని చెప్పారు.

'చర్యలు తీసుకోవాలి'

నంద్యాల రూరల్, సెప్టెంబరు 26: జిల్లాలోని బీసీ హాస్టళ్ల వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు, పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయ సూపరింటెండెంట్ గోవర్ధన్‌కు విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. రాంబాబు మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించకుండా నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. పూర్తిస్థాయి ఆధారాలతో జిల్లా కలెక్టర్, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కిరణ్, సాయి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తనిఖీ

మహానంది, సెప్టెంబరు 26: యి.బొల్లవరం గ్రామంలోని పంట పొలాల్లో సిబ్బంది రైతులతో చేస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంట నమోదు చేసుకొన్న ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవాలన్నారు. దీని ద్వారా ఖర్చు తక్కువతో పాటు పంట దిగుబడి అధికంగా వస్తుందని చెప్పారు. మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి ఏఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహానందిలో ప్రాయశ్చిత్త హోమం


హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

మహానంది, సెప్టెంబరు 26: మహానంది పుణ్య క్షేత్రంలో ప్రాయశ్చిత్త హోమాన్ని గురువారం ఆలయ వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. ఈవో నల్లకాల్వ శ్రీనివాసులరెడ్డి ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణంలోని యాగశాల మంటపంలో వేదపండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతశర్మలతో పాటు అర్చకులు భక్తిశ్రద్ధలతో హోమాలను జరిపారు. ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జునశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

'పౌష్టికాహారంతో ఆరోగ్యం'

పాణ్యం, సెప్టెంబరు 26: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని ఈవోఆర్డీ సులోచన అన్నారు. పౌష్టికాహార మాజోత్సవాల సందర్భంగా గురువారం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. తల్లులు, గర్భిణులు, బాలింతలు, మహిళలకు నవధాన్యాలు, ఐరన్, విటమిన్‌ల గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శి, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వెలుగోడు: ఈనె 30వ తేదీ వరకు మండలంలో పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసన్న తెలిపారు. గురువారం వెలుగోడులో మాట్లాడుతూ విలేకరులతె మాట్లాడుతూ సెప్టెంబరు 29న ప్రతి గ్రామ పంచాయతీలో అంగన్‌వాడీల ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జయంతి, భారతి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు గ్రామంలోని వెలుగు కార్యాలయంలో పౌష్టికాహార మహోత్సవాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధిదులుగా సీడీపీవో కోటేశ్వరమ్మ, ఎంఈవో శ్రీనాథ్ హాజరయ్యారు. గర్భిణులకు సీమంతం, పిల్లకు అన్నప్రాసణ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

పంట సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 26: రైతులు పంట సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని సంజీవ్‌నగర్ తండా గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించి, గ్రామ సభలో రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న టీడీపీ నాయకులు కేశన్నగౌడు తదితరులు

డోన్, సెప్టెంబరు 26: విజయవాడ వరద బాధితుల కోసం గురువారం డోన్ పట్టణంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కొండపేట, చిగురుమాను పేటలలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా కేశన్నగౌడు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోట్ల ఆదేశాల మేరకు వరద బాధితుల కోసం తమ వంతుగా విరాళాలు సేకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీఈ రాఘవేంద్రగౌడు, కిరణ్ యాదవ్, ఎల్లగౌడు, గోసానిపల్లి మాజీ సర్పంచ్ శ్రీరాములు, ధర్మవరం సంజీవుడు, కొచ్చెర్వు అశోక్, నూర్‌బాషా, యాపదిన్నె శ్రీనివాసులు, గుండాల నారాయణ స్వామి, ఓబులాపురం మనోహర్ పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా

కోవెలకుంట్ల, సెప్టెంబరు 26: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని నూతన చైర్మన్ సింగా నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కలుగొట్ల గ్రామంలో చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, కనకదుర్గా ఆలయాలకు దేవస్థానం చైర్మన్ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో సింగా నారాయణరెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



సింగా నారాయణరెడ్డిని సన్మానిస్తున్న గడ్డం నాగార్జునరెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

బనగానపల్లె, సెప్టెంబరు 26: మండలంలో పనిచేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఏపీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం పలుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గౌరీశంకర్ ఆధ్వర్యంలో సత్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబుళరెడ్డి, క్రీడా కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా ఆర్థిక కార్యదర్శి శ్రీపతి ఆధ్వర్యంలో సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన మహమ్మద్ రఫీ, ముకుందారెడ్డి, జె.విజయలను శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులరెడ్డి, లతీఫ్, సుబ్బయ్య పాల్గొన్నారు.

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిని కలిసిన సుబ్బారెడ్డి

డోన్, సెప్టెంబరు 26: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రయాదవ్‌ను గురువారం రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. విజయవాడలోని ఆయన నివాసంలో బీద రవిచంద్రయాదవ్‌ను కలిసి సుబ్బారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామభూపాల్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన సుబ్బారెడ్డిని వారు సన్మానించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశాలనుగుణంగా పని చేసి రైతులకు మేలు జరిగే కార్యక్రమాలు చేపడుతామన్నారు.



బీద రవిచంద్రయాదవ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్‌కు నేడు సుబ్బారెడ్డి రాక

డోన్, సెప్టెంబరు 26: రాష్ట్ర సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి శుక్రవారం డోన్ పట్టణానికి వస్తున్నారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ధర్మవరం చిన్ననాగిరెడ్డి, గౌతమ్ రెడ్డిల ఆధ్వర్యంలో పట్టణంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుంచి, పాతబస్టాండు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించేలా ఏర్పాట్లు చే శారు.

వాహనదారులు బీమా చేయించుకోవాలి

బనగానపల్లె, సెప్టెంబరు 26: ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి సూచించారు. మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన పాండురంగడు ఇటీవల విద్యుదాఘాతానికి గురై మృతి చెందగా ఓ ప్రైవేటు బీమా కంపెనీ వారు రూ.7 లక్షల చెక్కును మృతుడి భార్య శిరీషకు బనగానపల్లె ఎస్ఐ దుగ్గిరెడ్డి చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఇటీవల ద్విచక్ర వాహనం కొనుగోలు చేసి ఇన్సూరెన్సు చేశారు. అయితే ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందగా బీమా చేయించడంతో చెక్కు అందించారు. కార్యక్రమంలో రఘురామిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవిపై హర్షం

డోన్(రూరల్), సెప్టెంబరు 26: టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డికి రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వడంపై డోన్ పట్టణ టీడీపీ యువ నాయకులు హనుమంతరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సుబ్బారెడ్డి పార్టీకి అందించిన సేవలను గుర్తించి తొలి జాబితాలోనే నామినేటెడ్ పదవి ఇవ్వడం హర్షణీయమన్నారు.

కుందూలో పది వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం

చాగలమర్రి, సెప్టెంబరు 26: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూ వరద నీటి ప్రవాహం గురువారం పది వేల క్యూసెక్కులతో ప్రవహిస్తోందని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. గురువారం ఆనకట్ట సమీపంలోగల కేసీ కాలువ నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఆనకట్ట నుంచి కేసీ ప్రధాన కాలువకు 800 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని తెలిపారు. ఆయన వెంట సూపర్‌వైజర్ దస్తగిరి, లస్కర్లు ఉన్నారు.



చాగలమర్రిలో గర్భిణుల సామూహిక సీమంతంలో పాల్గొన్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన సీఎం చంద్రబాబు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 26: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం అందిస్తూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఘనత సీఎం నారా చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని బాచేపల్లె గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె గురువారం పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో సర్పంచ్‌ల నిధులను కాజేసి పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. బాచేపల్లె గ్రామాభివృద్ధికి రూ.49 లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. అలాగే ముస్లింలకు షాదీఖానా, శ్మశానానికి ప్రహరీ నిర్మిస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరిగి వంద రోజుల పాలన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎంపీడీవో మహబూబ్ ఖాన్, తహసీల్దార్ రత్న కుమారి, టీడీపీ మండల కన్వీనర్ శీలం హరి కుమార్‌రెడ్డి, సర్పంచ్ నరేంద్ర, గురుస్వామి, మస్తాన్, నాయబ్ రసూల్, నరసింహుడు, బద్రి సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

ఆళ్లగడ్డ పట్టణ పరిధిలోని పడకండ్లలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ గురువారం ప్రారంభించారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఏర్పాటు చేసినప్పటికీ త్వరలోనే శాశ్వత భవనాన్ని నిర్మిస్తామన్నారు. పట్టణంలో వంద పడకల ఆసుపత్రిని రానున్న రెండేళ్లలో నిర్మిస్తామని అన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, డీఐవో ప్రసన్న లక్ష్మి, వైద్యుడు నరసింహ, రాష్ట్ర ఎన్జీవో అధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రామ మద్దిలేటి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు పాలన ప్రజలకు భరోసా

చాగలమర్రి: రాష్ట్రంలో చంద్రబాబు పాలనతో ప్రజలకు భరోసా నింపుతుందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. చాగలమర్రి గ్రామంలోని అజీమ్ బ్రిలియంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన సామూహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను ఇంటింటికి వెళ్లి అతికించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు ఉసేన్‌వలి, విద్యా కమిటీ అధ్యక్షుడు గౌస్ మోహిద్దీన్, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, బీసీ సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్‌హుసేన్, పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్, టీడీపీ నాయకులు గుత్తి నరసింహులు, మౌలాలి, అనిఫ్, జెట్టి నాగరాజు, మాబులాల్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

డోన్: సీఎం చంద్రబాబు పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ అన్నారు. గురువా రం మండలంలోని బి.రామదుర్గం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ చంద్రబాబు ఇచ్చిన మాటను నిలుపుకుంటూ పేదల పింఛన్లు రూ.4వేలకు పెంచారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు ఇల్లు కట్టుకునేందుకు 3 సెంట్ల స్థలం ఇస్తానని చంద్రబాబు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, కమలాపురం సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, దేవరబండ వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, జయరాముడు, ఈశ్వర య్యాచారి పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో అద్భుత పాలన అందించిందని తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాదు, కొలి మిగుండ్ల యువనేత ఉలువల ప్రసాదు అన్నారు. గురువారం కొలిమిగుండ్లలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో ప్రసాదరెడ్డి, డాక్టర్ పద్మావతి, నాయకులు గూడూరు నాగేశ్వరరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, నరసిం హుడు, ఉలువల ప్రసాదు, మందా విజయ్, ఎమ్మార్పీస్ దస్తగిరి, రాజనేని చంద్రయాదవ్, గూడూరు మహేశ్వర రెడ్డి, భూపాల్‌రెడ్డి గ్రామంలో ఇంటింటికీ తిరిగి వంద రోజుల్లో ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించారు.

బనగానపల్లె: సీఎం నారా చంద్రబాబు నాయుడుతోనే సంక్షేమం సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. గురువారం బనగానపల్లె మండలం యనకండ్ల గ్రామంలో టీడీపీ నాయకులు బాలతి మ్యారెడ్డి, మదన్‌భూపాల్‌రెడ్డి, సాధుల శివశం కర్‌రెడ్డి, జనసేన నాయుడు భాస్కర్, గ్రామ సర్పంచ్ గోవింద్, అధికారుల ఆధ్వర్యం లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో శంకర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పోస్టర్‌ను అతికించారు. కార్యక్ర మంలో సచివాలయ సిబ్బంది. వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పేదల అభ్యున్నతే టీడీపీ లక్ష్యమని వల్లంపాటి సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల మండలంలోని వల్లంపాడు, లింగాల గుంజలపాడు గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం ప్రజావేదిక కార్యక్రమం జరిగింది. సర్పంచ్ జగ దీశ్వర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరిగి ఇది మంచి ప్రభు త్వం స్టిక్కర్లను అతికించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో లింగాల నాయుడు, గుంజలపాడు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'చంద్రబాబుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్'

రుద్రవరం : ఏపీ సీయం చంద్రబాబుతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమని టీడీపీ నాయకుడు ఎర్రం ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల ంలోని పెద్దకంబలూరు, టి. లింగందిన్నె గ్రామాల్లో స్వర్ణాంధ్రప్రదేశ్ 2047 పోస్టరును విడుదల చేసి ప్రజలకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఏపీ స్వర్ణంధ్రప్రదేశ్‌గా మారాలంటే సీఎం చంద్రబాబు నాయుడికే సాధ్యమన్నారు. ఇంటింటికీ ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను అతికించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, పంచాయతీ కార్యదర్శి షాహినూర్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



బి.రామదుర్గం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు



యనకండ్లలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



వల్లంపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి



కొలిమిగుండ్లలో స్టిక్కర్లు అందజేస్తున్న టీడీపీ నాయకుడు ఉలువల ప్రసాద్

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

డోన్(రూరల్), సెప్టెంబరు 26: డోన్ పట్టణం ఆటోనగర్‌కు చెందిన చిన్నారి మోక్షిత్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైంది. తల్లిదండ్రులు మహేష్‌బాబు, పద్మావతి చిన్నారి మోక్షిత్ వైద్యానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని ద్రోణాచలం సేవా సమితి సభ్యుడు దాతల సాయంతో రూ.1,16,385లను సేకరించిన మొత్తాన్ని చెక్కు రూపంలో డోన్ తహసీల్దార్ నాగమణి చేతులమీదుగా చిన్నారి మోక్షిత్ తండ్రి మహేష్‌బాబుకు అందజేశా రు. కార్యక్రమంలో నారాయణ పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ద్రోణాచలం సేవా సమితి అధ్యక్షుడు షాదీకానా రాజా, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ నిధులు విడుదల చేయాలి

ప్యాపిలి, సెప్టెంబరు 26: పాఠశాలల నిర్వహణ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకటనాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని జలదుర్గం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వెంకటనాయక్ మాట్లాడుతూ మూడేళ్లుగా పాఠశాలలకు నిధులు మంజూరు చేయకపోవడం వలన నిర్వహణ భారంగా మారిందన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్నపురెడి, హాజీమస్తాన్‌వలి, చంద్రమౌళి పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్యాపిలి, సెప్టెంబరు 26: పట్టణంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కారు డ్రైవర్ మురళి కుటుంబానికి డ్రైవర్లు చందాలు వేసుకొని రూ.40వేలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం పలువురు డ్రైవర్లు మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. డ్రైవర్లు రమేష్, పులికొండ, లక్ష్మీనారాయణ, వెంకటేష్, సుంకన్న పాల్గొన్నారు.

పలుకూరులో ఆటో, ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

బనగానపల్లె, సెప్టెంబరు 26: పలుకూరు గ్రామ పెట్రోల్ బంకులో సురేష్ గౌడ్‌కు చెందిన ఆటోలో ఉన్న బ్యాటరీని, ఆటో పక్కన ఉన్న ట్రాక్టర్ బ్యాటరీని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదు అందిందని నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య గురువారం తెలిపారు. వీటి విలువ సుమారు రూ.16వేలకు పైగా ఉంటుందని, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగర పంచాయతీ సిబ్బందికి సన్మానం

బేతంచెర్ల, సెప్టెంబరు 26: పట్టణంలో ఇటీవల జరిగిన గణేశ్ ఉత్సవాలకు సహకరించిన నగర పంచాయతీ సిబ్బందిని శాలువ, పూలమాలతో వినాయక చవితి కేంద్ర కమిటీ సభ్యులు సన్మానించారు. గురువారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో నూతన కమిషనర్ హరిప్రసాద్‌ను పరిచయం చేసుకుని శాలువ, పూలమాలతో సన్మానించారు. గణేశ్ ఉత్సవాలకు సహకరించిన నగర పంచాయతీ ఇంజనీరింగ్ సిబ్బంది శేఖర్, రాజు, గోపాల్, వాటర్‌మెన్ నాగన్న, రమణలను వినాయక చవితి కేంద్ర కమిటీ సభ్యులు గాజుల హరికృష్ణ, ఉదయ్ సింహ, చిరంజీవి, బోయ సంజీవ, మురళి సన్మానించారు.

డోన్‌లో బీజేపీ, జనసేన నిరసన



డోన్ డీఎస్పీ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డోన్(రూరల్), సెప్టెంబరు 26: తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రసాదాలో జరిగిన అపవిత్రతపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా డోన్ జనసేన, బీజేపీ హిందూత్వ సంఘాలు నిరసన కార్యక మాన్ని చేపట్టాయి. కొత్తబస్టాండు రోడ్డులోని స్వామి వివేకానంద విగ్రహం నుంచి డోన్ డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం, వడ్డె మహరాజ్, ఆర్మీ రామయ్య, షాషావలి శర్మ, మదు నాయుడు, పుల్లయ్య, మౌలాలి, గణేష్ వీరయ్య, హనీఫ్, పాపారాయుడు, ప్రసాద్, పవన్ కుమార్ రెడ్డి, కేసీ మద్దిలేటి, దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక

శిరివెళ్ల, సెప్టెంబరు 26: మండలంలోని రాజనగరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి టెన్ని కాయిట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తిరుపతిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు విజయ్ కుమార్ గురువారం తెలిపారు. అండర్-14 విభాగంలో ఉషశ్రీ, అండర్-17 విభాగంలో రెహమాన్ ఎంపికయ్యారని చెప్పారు. అక్టోబరులో ఏలూరు జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా జట్టులో క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. సత్తా చాటిన క్రీడాకారులను హెచ్ఎం, పీఈటీ, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్ బాబు, లక్ష్మీబాయి, ప్రేమ్ కుమార్ తదితరులు అభినందించారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

శిరివెళ్ల, సెప్టెంబరు 26: మండలంలోని యర్రగుంట్లలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ వ్యవసాయాధికారి రూపస్ రేనాల్డ్ తన బృందంతో గురువారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని శ్రీశ్రీ ఏజెన్సీస్‌లో యూరియాను అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గోడౌన్‌లో ఉన్న రూ.1,43,910 విలువగల యూరియా బస్తాలను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే గురు ఏజెన్సీస్‌లో ఈ-పోస్ మిషన్‌లో ఉన్న వివరాలకు గోడౌన్‌లో ఉన్న ఎరువుల నిల్వలకు తేడా ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. దీంతో రూ.9,98,700 విలువగల ఎరువులకు స్టాప్ సేల్స్ విధించినట్లు విజిలెన్స్ అధికారి తెలిపారు. కార్యక్రమంలో శిరివెళ్ల ఏవో సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'నష్టపోయిన రైతులను ఆదుకోవాలి'

చాగలమర్రి, సెప్టెంబరు 26: రెండు రోజుల పాటు కురిసిన అకాల వర్షంతో భారీగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని పెద్దబోదనం, చిన్నబోదనం, చాగలమర్రి, గొడిగనూరు, శెట్టివీడు తదితర గ్రామాలకు చెందిన రైతులు గురువారం ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల సమీపంలోని సర్వీసు రహదారుల్లో మొక్కజొన్న ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. పంట పంట కోతకొచ్చి నూర్పిడి చేసి ఆరబెట్టుకుంటున్న తరుణంలో వర్షానికి మొక్కజొన్న తడిసి నష్టం వాటిల్లిందని రైతులు, కౌలు రైతులు విలపించారు. తడిచిన ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేయరని, వారు అడిగిన ధరకే విక్రయించుకోవాల్సి వస్తుందని వాపోయారు. తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరారు.

శరన్నవరాత్రుల బ్రోచర్ల ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

చాగలమర్రి, సెప్టెంబరు 26: చాగలమర్రి గ్రామంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసర నవరాత్రుల ఉత్సవాల బ్రోచర్లను గురువారం ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబరు 3 నుంచి 15వ తేదీ వరకు దసరా ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షులు మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శులు, జ్వాల, శ్రీనివాసులు, కోశాధికారి నవతాప్రసాదు, సభ్యులు నాగేంద్రకుమార్, ఐడియా బాబు పాల్గొన్నారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల, సెప్టెంబరు 26: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని బ్రోచర్‌ను ఆర్య వైశ్య సంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుండా గోపాల్ మాట్లాడుతూ అమ్మవారిశాలలో ఈనెల 3న తెల్లవారుజామున కలశస్థాపన, రుద్రాభిషేకం, షోడోపచారా, నవగ్రహ పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజూ 9 రోజుల పాటు అమ్మవారు వివిధ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 26: మాయలూరు, అల్లూరు, ఉయ్యాల వాడ, ఆర్.పాంపల్లె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధర్ గురువారం పరిశీలించారు. ఆయన మాటాడుతూ అంగన్‌వాడీ చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వారి తాగే నీటిని, కేంద్రాల పరిశుభ్రతను పరిశీలించామని చెప్పారు. ఆయన వెంట ఏఈ ప్రణీత్‌కృష్ణ ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

దొర్నిపాడు, సెప్టెంబరు 26: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ శాప్ చైర్మన్‌గా నియమించిన రవినాయుడును కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో దొర్నిపాడు మండలాన్ని అభివృద్ధి బాట పట్టించేందుకు తామంతా కృషి చేస్తామని అన్నారు.

పగిలిన విద్యార్థి బస్సు టైరు

ఆందోళనకు గురైన విద్యార్థులు

రుద్రవరం, సెప్టెంబరు 26: రుద్రవరంలో గురువారం విద్యార్థి బస్సు టైరు పగలడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఆళ్లగడ్డ, నరసాపురం వెళ్లాల్సిన విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. నిదానంగా వెళ్తున్నప్పుడు టైరు పగిలిందని, వేగంగా వెళ్తున్నప్పుడు టైర్ పగిలి ఉంటే తమ పరిస్థితి ఏమిటని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యమైన టైర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. కోటకొండ నుంచి ఆళ్లగడ్డ వెళ్లే రహదారిలో రుద్రవరంలో టైరు పగిలింది.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుబ్రహ్మణ్యం

రుద్రవరం, సెప్టెంబరు 26: రుద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా సుబ్రహ్మణ్యం గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. ఆయన బనగానపల్లె నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారని చెప్పారు. ఇక్కడ పని చేస్తున్న ఏఈ ప్రమోద్ నంద్యాల ప్రాజెక్టుకు బదిలీ అయ్యారని ఎంపీడీవో తెలిపారు.

పరిశ్రమల సందర్శన

రుద్రవరం, సెప్టెంబరు 26: రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఒకేషనల్ ట్రైనర్లు జ్యోతిప్రియ, హరికృష్ణ ఆధ్వర్యంలో గురువారం రుద్రవరంలోని రైతు సేవా కేంద్రం, పాల ఫ్యాక్టరీ, మీ సేవా కేంద్రం, బ్యాంకులో లావాదేవీలు వంటివి సందర్శించారు. ఒకేషనల్ ట్రైనర్లు విద్యార్థులకు వ్యవసాయ ఉత్పత్తులు, భూమి విలువ, బయోమెస్ వాటి పద్ధతులు, నిర్వహణ, ప్రణాళికలను పరిశీలించారు. పాల ఫ్యాక్టరీలో పాలు ఎలా కూల్ చేస్తారన్న వాటిని విద్యార్థులకు వివరించారు. బ్యాంకులో లావాదేవీలు ఎలా ఉంటాయో వారికి వివరించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఏవో శ్రీకృష్ణ, ఏఈవో రాజు, వీఏఏలు నాగశ్రీ, శ్రావణి పాల్గొన్నారు.

నల్లమలలో నీటి కుంటల పరిశీలన

రుద్రవరం, సెప్టెంబరు 26: నల్లమల అటవిలోని చెలిమ రేంజ్ పరిధిలో ఉన్న రుద్రవరం మండలంలోని పెద్దకంబలూరు సెక్షన్ కోటకొండ బీట్‌లో నీటి కుంటలను స్కాడ్ డీఎఫ్‌వో రామకొండారెడ్డి, స్క్వాడ్ రేంజర్ శ్రీకాంత్ గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ నీటి కుంటలను ప్రభుత్వ నిబంధనల మేర తవ్వించాలన్నారు. దీని వల్ల అడవిలో ఉన్న వన్యప్రాణులకు నీటి సౌకర్యం ఉంటుందన్నారు. నీటి సౌకర్యం ఉన్నప్పుడు వన్యప్రాణులు అడవి దాటి రావని చెప్పారు. కార్యక్రమంలో రేంజర్ ఈశ్వరయ్య, సెక్షన్ ఆఫీసరు కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా అన్న క్యాంటీన్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 26: పేదల ఆకలి తీర్చేందుకు ఆళ్లగడ్డలోని టీబీ రోడ్డులో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లను మూసి వేయించింది. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలో భాగంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై పూర్తి స్థాయిలో దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఆళ్లగడ్డలో సైతం అన్న క్యాంటీన్ తిరిగి ప్రారంభం అవుతుండడంతో రూ.5కే అల్పాహారం, భోజనం అందుబాటులోకి వస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు

సంజామల, సెప్టెంబరు 26: తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని డోన్ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఖాజాహుసేన్ దుకాణాదారులు, డీలర్లను హెచ్చరించారు. గురువారం సంజామల అమ్మవారిశాలలో మండల వ్యాప్తంగా ఉన్న చౌక దుకాణ డీలర్లకు సంబంధించిన వేయింగ్ మిషన్లకు ఆయన ముద్రలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దుకాణదారులు లీగల్ మెట్రాలజీ అధికారులు ముద్రలు వేయని తూకపు రాళ్లతో క్రయ విక్రయాలు జరిపితే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల, సెప్టెంబరు 26: పట్టణంలోని దుర్గాపేటకు చెందిన శ్రీనివాసులు, భార్య సుబ్బమ్మ సారా విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దుర్గాపేటలో గురువారం పోలీసులతో దాడులు చేసి వారి వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సుబ్బమ్మపై కేసు నమోదు చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారని హెడ్ కానిస్టేబుల్ మాసూం తెలిపారు.

వచ్చే ఐదేళ్ల విజన్ ప్లాన్ సిద్ధం



గ్రామ సభలో మాట్లాడుతున్న ఈవోఆర్డీ శ్రీహరి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 26 : రాబోయే ఐదేళ్లలో గ్రామాల్లో చేపట్టాల్సిన విజన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు ఈవోఆర్డీ శ్రీహరి పేర్కొన్నారు. గురువారం కొలిమిగుండ్ల శివాలయంలో టీడీపీ నాయకులు గూడూరు నాగేశ్వరరెడ్డి, మహేశ్వరరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, యు.నరసింహుడు, ఉలువల ప్రసాదు, బొట్టుస్వామి, రాజనేని బ్రదర్స్ ఆధ్వర్యంలో మీ విజన్ .. మా మిషన్ గ్రామ సభ నిర్వహించారు. వచ్చే ఐదేళ్లలో కొలిమిగుండ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తీర్మానించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ పద్మావతి, ఉపసర్పంచ్ పెద్ద నాగయ్య, మందా విజయ్, ఎమ్మార్పీస్ దస్తగిరి, కోటపాడు శివరామిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, బోయ రవి, వెంకటేష్, టైలర్ రాముడు, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.